www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి సిటీ

నేడు పాఠశాలల పునఃప్రారంభం

● చక్కెర పొంగలితో విద్యార్థులకు స్వాగతం

ప్యారీస్, జూన్ 9: వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న సందర్భంగా, చక్కెర పొంగలితో విద్యార్థులను ఆహ్వానించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈ విద్యా సంవత్సరం వేసవి సెలవుల అనంతరం జూన్ 6న పాఠశాలలు ప్రారంభించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ మొదట ప్రకటించింది. అయితే ప్రాంతీయ వాతావరణ శాఖ హెచ్చరికలతో ఎండలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలల పునఃప్రారంభాన్ని మరికొన్ని రోజులు వాయిదావేయాలని పలు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఈ నెల 10 పాఠశాలలను పునఃప్రారంభిస్తామంటూ విద్యాశాఖ ప్రకటించింది. ఆ మేరకు రాష్ట్రమంతటా సోమవారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. విద్యార్థుల భద్రత నిమిత్తం ముందస్తు ఏర్పాట్లు కూడా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేపట్టారు. ఈ నేపథ్యంలో, సోమవారం పాఠశాలల్లో అడుగపెట్టనున్న విద్యార్థినీ, విద్యార్థుల నోరు తీపి చేసేలా చక్కెర పొంగలి అందజేసి ఆహ్వానించనున్నారు.

అన్ని రాష్ట్రాలకూ..
జస్టిస్ ఏకే రాజన్ కమిటీ నివేదిక

● సీఎం స్టాలిన్ ప్రకటన



చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నీట్ వల్ల విద్యార్థులకు కలిగే నష్టాలపై డీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఏకే నటరాజన్ కమిటీ నివేదికలను అన్ని రాష్ట్రాలకు పంపి ఆ పరీక్షల రద్దు ప్రతిపాదనకు మద్దతు సేకరించనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశం వెలువరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుపేద విద్యార్థులకు నీట్ తీవ్ర నష్టం కలిగిస్తుందంటూ మొద్దమొదట ప్రకటించి ఆ పరీక్షలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు జరిపింది డీఎంకే మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. నీట్ నిర్వహణ సైతం మొదటి నుంచి సక్రమంగా లేదని, అవకతవకలు జరుగుతున్నాయంటూ ఎంత మొత్తుకున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, ఇక తాజాగా జరిగిన నీట్ పరీక్షల్లో బారీ స్థాయిలో జరిగిన అవినీతి అక్రమాలు బహిర్గతమయ్యాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే నీట్ వల్ల విద్యార్థులకు జరిగే నష్టాలపై పరిశీలన జరిపేందుకు జస్టిస్ ఏకే నటరాజన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ సిఫారసుల మేరకు అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా చేసిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదింపజేసి ఆ బిల్లును గవర్నర్‌కు పంపామని ఆయన వివరించారు. అయితే గవర్నర్ శాసనసభలో ఆమోదించిన బిల్లును రాష్ట్రపతికి పంపకుండా అనవసరంగా కాలయాపన చేశారని ఆరోపించారు. చివరకు తీవ్ర జాప్యం అనంతరం గవర్నర్ నీట్ వ్యతిరేక బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారని ఆయన తెలిపారు. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో నీట్ నిర్వహణను తప్పుబడుతూ తీవ్ర విమర్శలు బయలుదేరటం సముచితమేనన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలకు జస్టిస్ ఏకే నటరాజన్ నివేదిక పంపి నీట్ రద్దుకు గట్టి మద్దతు సేకరించేందుకు చర్యలు తీసుకుంటామని స్టాలిన్ ఆ సందేశంలో తెలిపారు.

మోదీ కేబినెట్‌లోకి మళ్లీ మురుగన్



కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మురుగన్



కమలాలయం వద్ద బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో (3.0) రాష్ట్ర బీజేపీ నేత డాక్టర్ ఎల్.మురుగన్‌కు మళ్లీ చోటు లభించింది. మోదీ పట్ల విధేయత, పార్టీ పట్ల విశ్వాసం ఆయనకు మరోసారి కేంద్రంలో స్థానం కల్పించాయి. దీంతో భాగస్వామ్య పక్షాలతో కూడిన ఎన్‌డీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి కూడా అవకాశం లభించినట్టయింది. 1977 మే29న జన్మించిన డాక్టర్ ఎల్.మురుగన్ న్యాయవాదిగా మద్రాసు హైకోర్టులో దశాబ్దానికి పైగా ప్రాక్టీస్ చేశారు. హిందుత్వ భావజాలానికి ఆకర్షితులైన ఆయన ఆర్ఎస్ఎస్‌కు దగ్గరవడంతో పాటు బీజేపీలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ కింది స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల వరకు చక్కగా నిర్వర్తించి పార్టీ అధిష్ఠానం చేత ప్రసంశలందుకున్నారు. మురుగన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే రాష్ట్ర అసెంబ్లీలోకి ఐదుగురు బీజేపీ అభ్యర్థులు ప్రవేశించారు. ఆయన పనితీరు వలనే కింది స్థాయి నుంచి పార్టీ బలోపేతం అయినట్టు గుర్తించిన ప్రధాని నరేంద్రమోది 2021 జూలైలో మురుగన్‌ను కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఎమ్మెల్యేలను పరిచయం చేసేందుకు ఢిల్లీ వెళ్లిన మురుగన్‌కు మోదీ అనూహ్యమైన బహుమతిగా కేంద్ర మంత్రి పదవి కట్టబడుతున్నట్లు ప్రకటించారు. అక్కడికక్కడే.. 2021 జూలై 7న కేంద్ర సహాయ మంత్రిగా మురుగన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.. కేంద్ర మత్స్య, జంతుసంరక్షణ, డైరీ, సమాచార శాఖ సహాయ మంత్రిగా చక్కగా బాధ్యతలు నిర్వర్తించి మోదీకి సన్నిహితుడయ్యారు. నామక్కల్ జిల్లా కూనూరుకు చెందిన మురుగన్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నీలగిరి నియోజకవర్గం నుంచి పోటీచేశారు. అయితే డీఎంకే నేత రాజా చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా మురుగన్ పనితీరు గుర్తించిన మోదీ మళ్లీ అతడిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకున్నారు. కేంద్ర సహాయ మంత్రిగా ఆయనను కొనసాగించాలని నిర్ణయించారు. మురుగన్ మళ్లీ కేంద్ర మంత్రి పదవి రావడం పట్ల రాష్ట్ర బీజేపీలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మురుగన్ ప్రమాణ స్వీకారం చేస్తుండగానే బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం కమలాలయం వద్ద పార్టీ కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. నిజానికి రెండు రోజుల క్రితం ఢిల్లీలో మాట్లాడిన మోదీ తమిళనాడులో తమ పార్టీకి ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందంటూ ఇక్కడి నేతల పనితీరును ప్రశంచారు. దీంతో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అన్నామలైకి కేంద్ర మంత్రి పదవి ఖాయమని అన్ని వర్గాలు భావించాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ప్రసారమాధ్యమాల్లో అన్నామలై కోసం విస్తృతంగా కథనాలు వెలువడ్డా యి. కానీ అనూహ్యంగా ఎల్.మురుగన్‌నే మళ్లీ తన మంత్రి వర్గంలోకి తీసుకోవాలని మోదీ నిర్ణయించడం గమనార్హం.

ప్రశాంతంగా ముగిసిన గ్రూపు-4 పరీక్షలు

● 6244 పోస్టులకు 20.36 లక్షల మంది పోటీ

అడయార్, జూన్ 9: రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప-4 పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాతపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా హాలులోకి అభ్యర్థులను ముమ్మరంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిచ్చారు. మొత్తం 6244 పోస్టులకు 20.36 లక్షల మంది నిరుద్యోగులు పోటీ పడ్డారు. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్‌సీ) రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలోని గ్రూపు-4 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 6244 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఇందులో వీఏవో పోస్టులు 108, జూనియర్ ఆఫీసర్ 2604, టైపిస్టులు 1705, షార్ట్‌హ్యాండ్ టైపిస్టులు 445, స్పెషల్ అసిస్టెంట్ క్లర్క్ 3, స్పెషల్ సెక్రటరీ 4, జూనియర్ నిర్వాహకులు 41, ఒక రిసెప్షనిస్ట్ , 25 ల్యాబ్ అసిస్టెంట్స్, బిల్ కలెక్టర్లు, కానిస్టేబుల్ పోస్టులు 1177 మొత్తం 6244 పోస్టులున్నాయి. ఈ పోస్టుల భర్తీకి జనవరి 30న నోటిఫికేషన్ విడుదల చేయగా, ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ పరీక్షకు పదో తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అయితే, టెన్త్ నుంచి పీజీ, ఇంజనీరింగ్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్నత విద్యావంతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 2037101 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 817702 మంది పురుషులు 1218922 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఈ పరీక్షలను ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 7247 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఒక్క చెన్నై నగరంలోనే మైలాపూర్, రాయపురం, రాయపేట, సైదాపేట, వెప్పేరి, వేళచ్చేరి, అన్నా నగర్, పెరంబూరు, తిరువొత్రియూరు, తిరువాన్మియూరుతో సహా మొత్తం 432 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రాంభమవుతుండగా, అభ్యర్థులు మాత్రం పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే వచ్చి చేరారు. కాంచీపురం జిల్లా శకంర యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఓ యువతి పెళ్ళి దుస్తుల్లోనే వచ్చి పరీక్ష రాసింది. ఈ పరీక్షను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.



చెన్నైలోని పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

సమాచార దర్శిని

పాఠశాల హ్యాండ్‌బుక్ విడుదల

ఐసిఎఫ్, జూన్ 9: పాఠశాల హ్యాండ్‌బుక్‌ను విద్యా శాఖ విడుదల చేసింది. ప్రతి ఏటా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ హ్యాండ్ బుక్ విడుదల చేస్తుంటారు. ఈ క్రమంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన హ్యాండ్ బుక్ విడుదల చేశారు. దీనిపై అభిప్రాయాలు, ఆక్షేపణలుంటే msectndse@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ హ్యాండ్ బుక్‌లో పేర్కొన్న విధంగా సోమవారం 1 నుంచి ప్లస్ టూ వరకు అన్ని తరగతులు ప్రారంభం కానున్నాయి.

1 నుంచి ఉచిత బాక్సింగ్ శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 9: స్థానిక షేనాయ్‌నగర్‌లో 8 ఏళ్ల పైబడిన విద్యార్థులకు బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ జూలై 1 నుంచి ప్రారంభం కానుంది. తమిళనాడు బాక్సింగ్ సంఘం రిజిస్ట్రేషన్ పొందిన స్వామి వివేకానంద బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా ఉచిత బాక్సింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది శిక్షణ అమింజికరై సమీపంలోని షేనాయ్‌నగర్ పార్కులో జూలై 1 నుంచి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటలకు, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ఇవ్వనున్నారు. ఏడాది శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9094032387, 8838811467 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

296 రైళ్ల నెంబర్లు మార్పు

ఐసిఎఫ్, జూన్ 9: కరోనా అనంతరం ప్రత్యేక రైళ్లు సాధారణ ప్యాసింజర్ రైళ్లుగా నడుపనున్నారు. దీంతో, జూలై 1వ తేది నుంచి 296 రైళ్ల నెంబర్లు మార్చనున్నట్లు అధికారులు తెలిపారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక రైళ్లు మాత్రమే నడిచాయి. జిల్లాల నుంచి ప్రధాన నగరాలను కలిపే తక్కువ దూరానికి సాధారణ చార్జీ ప్యాసింజర్ రైళ్లను ప్రత్యేక రైళ్లుగా నడిపారు. ఈ రైళ్లకు '0'తో ప్రారంభమయ్యే నెంబర్లు తాత్కాలికంగా కేటాయించారు. జూలై 1 నుంచి ఈ రైళ్లకు సాధారణ నెంబర్లు ప్రకటించనున్నారు. ఈ నెంబర్లు 567 నుంచి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

హస్తకళా వస్తువుల ప్రదర్శన ప్రారంభం

ఐసిఎఫ్, జూన్ 9: రాష్ట్రప్రభుత్వ పుంపుహార్ ఆధ్వర్యంలో పారంపర్య హస్తకళా వస్తువుల ప్రదర్శన ఆళ్వార్‌పేటలో ప్రారంభమైంది. ఇందులో పంచలోహ విగ్రహాలు, కొయ్య శిల్పాలు, ఇత్తడి దీపాలు, తంజావూరు కళాత్మక ప్లేట్లు, చిత్రలేఖనాలు బంకమన్ను, రాతి, కాగితపు గుజ్జుతో తయారైన బొమ్మలు, ఫర్నిచర్, నార వస్తువులు, రుద్రాక్ష, తోలు వస్తువులు ప్రదర్శిస్తున్నారు. సెప్టెంబరు వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శించవచ్చని పుంపుహార్ మేనేజర్ గోపి తెలిపారు.

193 మంది వైద్యుల నియామకాల రద్దు

పెరంబూర్, జూన్ 9: ప్రభుత్వాస్పత్రుల్లో ఉద్యోగాలకు ఎంపికై, నిర్ణీత కాలంలో విధుల్లో చేరని 193 మంది వైద్యుల ఉద్యోగ నియామకాలను రద్దు చేస్తూ ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వైద్య ఉద్యోగుల ఎంపిక కమిషన్ ద్వారా 1,021 మంది వైద్యుల ఎంపిక జరిగిన నేపథ్యంలో, వారిలో 193 మంది నిర్ణీత కాలంలో విధుల్లో చేరకపోవడంతో, వారి ఉద్యోగ నియామకాలు రద్దు చేసినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

21న హిజ్రాలకు ప్రత్యేక శిబిరం

ఐసిఎఫ్, జూన్ 9: స్థానిక రాజాజీ రోడ్డులో ఉన్న కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 21వ తేది హిజ్రాలకు ప్రత్యేక శిబిరం జరుగనుంది. ఈ శిబిరంలో హిజ్రాల సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డుల జారీ, ఆధార్ సవరణలు, ప్రభుత్వ వైద్య బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి చర్యలు చేపట్టనున్నారు. నగరంలో నివసించే హిజ్రాలందరూ పాల్గొని లబ్ధి పొందాలని కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా సెంథిల్

ఐసిఎఫ్, జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా మదురైకి చెందిన డా.సెంథిల్ నియమితులయ్యారు. కార్యదర్శిగా దిండుగల్‌కు చెందిన శ్రీనివాసన్, కోశాధికారిగా తిరువళ్లూర్‌కు చెందిన ప్రభుశంకర్ నియమితులయ్యారు.

4,194 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

ఐసిఎఫ్, జూన్ 9: నగరంలో ఏర్పాటుచేసేందుకు 4,194 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. నగరంలో ఇదివరకే ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లలో కొన్ని తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టిన విద్యుత్ బోర్డు, 4,194 ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసింది. ప్రస్తుతం 2,550 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

18న రవాణా కార్మికుల ఆందోళన

పెరంబూర్, జూన్ 9: రవాణా కార్మికులు ఈ నెల 18వ తేది ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు రవాణా కార్మికుల సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి పద్మనాభన్ విడుదల చేసిన ప్రకటనలో... రవాణా శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టుల భర్తీచేయాలి, డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు చేస్తున్న వారిని గూండా చట్టం కింద అరెస్ట్ చేయాలి, రవాణా శాఖ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అందించాలి, పింఛన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి సహా పలు కోర్కెల సాధనకు విల్లుపురం, సేలం, కోవై, మదురై, తిరునల్వేలి, పుదుకోట ప్రాంతాల్లో రవాణా శాఖ కార్యాలయాల ఎదుట 18వ తేది ఆందోళన చేపట్టనున్నామని తెలిపారు.

గ్యాస్ లీకేజీ గుర్తించే పరికరం

ఐసిఎఫ్, జూన్ 9: ఇళ్లల్లో వంటగ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో వాషర్, వాల్వు సక్రమంగా ఉన్నాయా, లేవా అని గుర్తించేందుకు 'లీక్ డిటెక్టర్' అనే పరికరాలను సిబ్బందికి ఇండియన్ ఆయిల్ సంస్థ అందజేసింది. రాష్ట్రంలో ఇండియన్ ఆయిల్ సంస్థకు 1.32 కోట్ల గృహ గ్యాస్ సిలిండర్ వినియోగదారులున్నారు. కొన్ని సిలిండర్లలో రెగ్యులేటర్ అనుసంధానం చేసే భాగంలో ఉన్న వాషర్, వాల్వు సక్రమంగా అమర్చకపోవడంతో గ్యాస్ లీకవుతుంది. దీనిని అడ్డుకొనేలా ఉద్యోగులకు లీక్ డిటెక్టర్ పరికరాలను అందజేసింది.

లక్ష మందికి గృహ రుణాలు

ఐసిఎఫ్, జూన్ 9: రాష్ట్రప్రభుత్వ 'కలైంజర్ కలై ఇల్లం' పథకం కింద లక్ష మందికి గృహ రుణాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పథకంలో ఆరేళ్లలో 8 లక్షల గుడిసెవాసులకు కాంక్రీట్ గృహాలు నిర్మించారు. తొలివిడతగా ఈ ఏడాది లక్ష కొత్త గృహాలు నిర్మించనున్నారు. లబ్దిదారులు ఈ పథకం కింద ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉండడంతో, నిర్ధేశించిన నగదుకంటే అవసరమైతే సహకార, వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు పొందే సౌకర్యం కల్పించారు. సహకార బ్యాంకుల ద్వారా 9.50 శాతం నుంచి 10 శాతం వడ్డీతో రూ. లక్ష ఇవ్వాలని ఉత్తర్వులిచ్చారు. ఈ ఏడాది ఎంపికైన లక్ష మందికి రుణాలు అందజేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతి డైరెక్టరేట్ సహకార సంఘాల రిజిస్ట్రార్లకు లేఖ రాసింది. జిల్లాల వారీగా రుణాలు పొందనున్న లబ్దిదారుల సంఖ్య కూడా ఇందులో పేర్కొంది.

పట్టపగలు పారిశ్రామికవేత్త దారుణహత్య

పెరంబూర్, జూన్ 9: తంజావూరులో డీఎంకేకు చెందిన పారిశ్రామికవేత్తను గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు దారుణంగాహత్య చేసి పరారయ్యారు. తంజావూరు జిల్లా చోళంగనల్లూర్‌కు చెందిన కె.బాబు (48) అనే డీఎంకే నేత కారైక్కాల్ హార్బర్‌లో మోటారు వాహనాల కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయన ఆదివారం తంజావూరులో జరిగిన శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు కారులో వచ్చాడు. తంజావూరు జ్ఞానం నగర్‌లో వస్తుండగా కారు ఆపిన బాబు, సమీపంలోని దుకాణానికి వెళ్లి చదివింపుల కవర్ కొనుగోలు చేశారు. ఆ సమయంలో మరో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో అతడిపై దాడిచేసి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబు సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ ఆశిష్ రావత్, ఏడీఎస్పీ వి.జయచంద్రన్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. వ్యాపారంలో పోటీ కారణంగా తనకు హత్యా బెదిరింపులు వస్తున్నాయని తిరువారూరు జిల్లా వైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇదివరకే బాబు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ కారణంగా ఈ హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తంజావూరు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.




హత్యకు గురైన బాబు (ఫైల్‌ఫొటో) - ఘటనా స్థలంలో ఎస్పీ విచారణ (పక్కచిత్రంలో)

లోక్ అదాలత్‌లో 64 వేల కేసుల పరిష్కారం

బాధితులకు రూ.334 కోట్ల నష్టపరిహారం

ఐసిఎఫ్, జూన్ 9: రాష్ట్రంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 64,142 కేసులు పరిష్కారమయ్యాయి. తద్వారా బాధితులకు రూ.344.54 కోట్లు నష్టపరిహారం అందిందని రాష్ట్ర లా కమిషన్ సభ్యులు, కార్యదర్శి నషీర్ అహ్మద్ తెలిపారు. దేశవ్యాప్తంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ తగ్గించేలా ప్రతి సంవత్సరం నాలుగు సార్లు జాతీయ స్థాయి లోక్‌అదాలత్ జరుగుతోంది. ఇందులో కేసుకు సంబంధించి ఇరుపక్షాల వారిని న్యాయమూర్తులు చర్చించి సామరస్యం చేస్తున్నారు. ఇరుపక్షాల సమ్మతంతో కేసులు పరిష్కరిస్తున్నారు. ఈ విషయమై కార్యదర్శి నషీర్ అహ్మద్ మాట్లాడుతూ... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మహాదేవన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జాతీయ లోక్‌అదాలత్ శనివారం జరిగిందని తెలిపారు. మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తులు భరత్‌చక్రవర్తి, సుందరమోహన్, కుమరేష్‌బాబు, బాలాజి, గోవిందరాజన్ తిలగవతి, లక్ష్మీనారాయణన్, ధనపాల్, సెంథిల్‌కుమార్, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో న్యాయమూర్తులు విక్టోరియా గౌరి, కె.రాజశేఖర్, అరుళ్‌మురుగన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి రామలింగంల ఆధ్వర్యంలో 12 సిట్టింగ్‌లు, జిల్లా స్థాయి కోర్టులు మొత్తం 465 సిట్టింగ్‌లు ఏర్పాటుచేసి కేసులు పరిష్కరించారన్నారు. ఇందులో మొత్తం 64,142 కేసులు పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం అందజేశామని తెలిపారు.

ఆడిటర్ నివాసంలో భారీ చోరీ

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లో నివసిస్తున్న ఆడిటర్ నివాసంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 150 సవర్ల బంగారు నగలు నగదు దోచుకెళ్లారు. ఈరోడ్ ఎన్జీఓ కాలనీలోని రెండస్తుల ఇంటి పైభాగంలో సుబ్రమణి అనే ఆడిటర్ నివసిస్తున్నారు. ఆయన భార్య సాధన ప్రైవేటు కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు అంబ్రోస్ బెంగళూరు ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆ భవనం దిగువ అంతస్తులు ఇంటి యజమానులుంటున్నారు. శనివారం ఉదయం సుబ్రమణి కుటుంబ సమేతంగో తేనిలో బంధువుల పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఇంటి దిగువన ఉండే యజమాని కుమారుడు పై అంతస్థుకు వెళ్లగా సుబ్రమణి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటే ఆ విషయాన్ని ఆడిటర్ సుబ్రమణికి ఫోన్ చేసి తెలిపారు. ఆ తర్వాత సుబ్రమణి ఈరోడ్ సూరంబట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి సుబ్రమణి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలోని వస్తువలన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. పడకగదిలోని బీరువాలో ఉన్న 150 సవర్ల బంగారు నగలు, రూ.1.50లక్షల నగదు దోపిడీకి గురైనట్లు గుర్తించారు.. వేలి ముద్రనిపుణులను రప్పించి దోపిడీ దొంగల వేలిముద్రలను సేకరించారు. పోలీసు జాగిలం 'వీరా'ను కూడా రంగంలో దింపారు. ఆ శునకం ఇంటి నుంచి కొంత దూరం వరకూ వెళ్ళి ఆగిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దోపిడీ దొంగల ఆచూకీ కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు.



దోపిడీకి గురైన ఆడిటర్ నివాసగృహం

'నీట్' రద్దుచేయాలి

పెరంబూర్, జూన్ 9: 'నీట్' శాశ్వతంగా రద్దు చేయాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఏడాది నిర్వహించిన నీట్ రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలన్నారు. హరియానాలో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు సహా 67 మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చర్చనీయాంశమైందని దినకరన్ పేర్కొన్నారు.

పశువుల యజమానుల నుంచి రూ.68 వేల వసూలు

ఐసిఎఫ్, జూన్ 9: స్థానిక తాంబరం పరిధిలోని ప్రాంతాల్లో పశువుల యజమానుల నుంచి రూ.68 వేలు జరిమానా అధికారులు వసూలుచేశారు. తాంబరం కార్పొరేషన్‌లో రోడ్లపై తిరిగే పశువులను బంధించి వాటి యజమానులకు జరిమానా విధిస్తున్నారు. ఆ ప్రకారం, మార్చి 10 నుంచి మే 30 వరకు 74 పశువులు బంధించి వాటి యజమానులకు రూ.68 వేలు జరిమానా విధించారు.

కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

వేలూరు, జూన్ 9: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై రెండు నెలలుగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో వారు ట్రాఫిక్ పోలీసులతో కలసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు.ఆదివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసిన వారికి ఎస్పీ మణివన్నన్ సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఏడీఎస్పీ కోటీశ్వరన్, వేలూరు ట్రాఫిక్ భద్రతా గ్రూపు అధ్యక్షుడు రమేష్‌కుమార్ జైన్, వేలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అరివయగన్, ట్రాఫిక్ పోలీసు కమిటీ కార్యదర్శి డా.ఇక్రమ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, సభ్యులు జనార్థనన్, డా.దీనబంధు, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ మణివన్నన్

ఇసుక అక్రమ రవాణా

వేలూరు, జూన్ 9: స్థానిక కాట్పాడి వల్లిమలై రోడ్డు లక్ష్మీ నగర్‌లో సుమారు 40 టన్నుల ఇసుకను రాత్రి వేళల్లో కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. అందుకోసం ఈ ప్రాంతంలోని మూడో వీధిలో ఇసుక ఉంచుతున్నారు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై కలెక్టర్ స్పందించి, ఇసుక మాఫియా ముఠా, వారిని సహకరిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీనగర్‌లో నిల్వ చేసిన ఇసుక

నీట మునిగి ముగ్గురు చిన్నారుల దుర్మరణం

పెరంబూర్, జూన్ 9: ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు నీటమునిగి మృతిచెందిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. చెయ్యారు సమీపం నెడుంపిరై గ్రామానికి చెందిన సంతోష్ (8), భరత్ (8), సాయిచరణ్ (11) ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెరువుకు వెళ్లారు. తీరంలో సరదాగా స్నానం చేస్తున్న వారు ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగారు. గమనించిన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని చెరువులో గంటసేపు గాలించి ముగ్గురి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంజనీరింగ్ దరఖాస్తుల గడువు పెంపు

పెరంబూర్, జూన్ 9: ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్ల స్వీకరణ మంగళవారం (ఈనెల 11వ తేది) వరకు పొడిగించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తు స్వీకరణ మే 6న ప్రారంభమై ఈనెల 6వ తేదీతో ముగిసింది. మొత్తం 2,49,918 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, దరఖాస్తు సమర్పణకు మరో రెండు రోజులు అవకాశం కల్పించారు. ఆ ప్రకారం, విద్యార్థులు www.tneaonline.org అనే వెబ్‌సైట్‌లో మంగళవారంలోపు దరఖాస్తులు సమర్పించవచ్చని సాంకేతికవిద్య డైరెక్టరేట్ ప్రకటన విడుదల చేసింది.

ప్రభుత్వాస్పత్రిలో రౌడీ మూకల విధ్వంసం

పెరంబూర్, జూన్ 9: స్థానిక రాయపేట ప్రభుత్వాస్పత్రిలో చొరబడి విధ్వంసం చేసిన రౌడీ మూకల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నగరంలో మత్తు మాత్రలు విక్రయిస్తున్న కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సైకో చరణ్, బోండా రాజేష్, దినేష్ తదితరులను వైద్య పరిశోధనల కోసం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆసుపత్రికి వచ్చిన వారి మద్దతుదారులు ధ్వంసానికి పాల్పడ్డారు. వైద్య పరికరాలు, ఆస్పత్రి అద్దాలు సహా పలు వస్తువులు ధ్వంసం చేశారు. ఈ విధ్వంసంతో ఆస్పత్రిలో ఉద్రిక్తత నెలకొంది. కొద్దిసేపటి అనంతరం ఆ మూకలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఈ విధ్వంసానికి పాల్పడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భార్యను చంపి పూడ్చిపెట్టి భర్త ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 9: భార్యను హతమార్చి పూడ్చిపెట్టిన భర్త, తాను కూడా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. వెప్పూర్ సమీపం లక్ష్మణపురం మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన శక్తివేల్ (33) రెండేళ్లక్రితం సువేద(20)ను ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పిల్లలులేరు. కళ్లకుర్చి జిల్లా నయినార్‌పాళయంలో వారు అద్దింట్లో నివసిస్తున్నారు. ప్రొక్లయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శక్తివేల్, అదే ప్రాంతంలోని చెరువులో పూడికతీత పనుల్లో భార్యతో సహా పాల్గొంటున్నాడు. శనివారం పనులు చేస్తున్న సమయంలో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆగ్రహం చెందిన శక్తివేలు భార్యపై దాడిచేయడంతో ఆమె మృతిచెందింది. దీంతో, దిగ్భ్రాంతి చెందిన శక్తివేల్, ఆ ప్రాంతంలోనే గుంత తవ్వి మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ విషయాన్ని తన బంధువులకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపి, సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. తహసీల్దార్ నేతృత్వంలో సువేద మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం, శక్తివేల్ మృతదేహంతో పాటు కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



సువేద (ఫైల్‌ఫొటో)

ప్రత్యేక శిక్షణకు విదేశాలకు విద్యార్థులు

అడయార్, జూన్ 9: నాన్ ముదల్వన్ దిట్టం (నేను ముఖ్యమంత్రి పథకం) కింద ఎంపికైన విద్యార్థులు ప్రత్యేక శిక్షణ కోసం ఆదివారం విదేశానికి వెళ్ళారు. ఈ పథకం కింద మొత్తం 25 మంది విద్యార్థులు ఎంపిక కగా, వారంతా వారు చదివే విద్యలో ప్రత్యేక శిక్షణ పొందేందుకు చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానంలో లండన్ బయలుదేరి వెళ్ళారు. లండన్ చేరుకునే వీరికి ఈ నెల 16వ తేదీ వరకు శిక్షణ ఇస్తారు. వీరివెంట పలువురు ఉన్నతాధికారులు వెళ్ళారు. కాగా, ఈ పథకం కింద ప్రత్యేక శిక్షణ పొందేందుకు 1267 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిని వివిధ దశల్లో వడపోత చేసి చివరకు 25 మందిని ఎంపిక చేశారు.

అదనపు బస్సులు నడపాలి

పెరంబూర్, జూన్ 9: విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ విడుదల చేసిన ప్రకటనలో... వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులకు పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలుపడంతో పాటు చదువులో రాణించి అభివృద్ధి చెందాలని కోరారు. విద్యార్థులు ప్రయాణించేందుకు వీలుగా ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులు నడపాలి, ఖాళీ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం విజ్ఞప్తి చేసింది.

రూ.8.5 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

అడయార్, జూన్ 9: సింగపూర్ నుంచి చెన్నైకు అక్రమంగా తీసుకొచ్చిన రూ.8.5 కోట్ల విలువ చేసే 13.5 కేజీల బంగారాన్ని ఎయిర్‌పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శ్రీలంకకు చెందిన ప్రయాణికురాలి సహా బంగారం స్మగ్లింగ్‌కు సహకరించిన ఎయిర్‌పోర్టు సిబ్బంది ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సింగపూర్ నుంచి చెన్నై వస్తున్న విమానంలో భారీ మొత్తంలో బంగారాన్ని తరలిస్తున్నట్టు ఎయిర్‌పోర్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు ప్రయాణికులను తనిఖీ చేసి బంగారం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

అన్నాడీఎంకేలో మరో సంక్షోభం

మంత్రి రఘుపతి జోస్యం

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయాన్ని చవిచూసిన ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలో మరో సంక్షోభం ఏర్పడబోతున్నదని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి రఘుపతి జోస్యం చెప్పారు. పుదుకోటలో సుప్రసిద్ధ తిరువప్పూరు ముత్తుమారియమ్మన్ ఆలయంలో ఆదివారం ఉదయం బాలాలయ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో నాలుగువందలకు పైగా నియోజకవర్గాలలో గెలిచి అత్యధిక మెజారిటీ కలిగిన ఏకైక పార్టీగా అధికారం చేపడతామని గొప్పలు చెప్పుకున్న బీజేపీ మెజారిటీ లేక మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలతో అధికారం చేపట్టనుండటం శోచనీయమన్నారు. ప్రధానమైన రెండు మిత్రపక్షాల మద్దతు లేకుండా ప్రభుత్వాన్ని నడుపలేని స్థితిలో ప్రధాని మోదీ కొట్టుమిట్టాడటం తథ్యమని అన్నారు. చాలినంత మెజారిటీలేని బీజేపీ ప్రభుత్వం త్వరలో పతనమవుతుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి ఎన్డీయే దూకుడుకు కళ్లెం వేసి ఘనవిజయం సాధించిందని చెప్పారు. ఇక రాష్ట్రంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో తమ కూటమిదే విజయమంటూ ఎన్నికల ప్రచారం ప్రారంభించారని, చివరకు నలభై సీట్లలోను విజయపతాకం ఎగురవేశారని మంత్రి రఘుపతి అన్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓటమి పాలైన అన్నాడీఎంకేలో త్వరలోనే మరో సంక్షోభం ఏర్పడనుందని, ఆ పార్టీ మళ్ళీ ముక్కచెక్కలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎడప్పాడి పళనిస్వామికి తన పార్టీ ఎదుర్కొనన్ను గడ్డు పరిస్థితులు తెలిసినా మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ డీఎంకేపై పసలేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీలో నేర చరిత్ర కలిగినవారే అధికంగా ఉన్నారంటూ ఆ పార్టీకి చెందిన మాజీ గవర్నర్ తమిళిసై చేసిన ఆరోపణ వాస్తవమేనని, ఈ విషయాన్ని తామెప్పటి నుండో చెబుతూ వస్తున్నామని మంత్రి రఘుపతి అన్నారు.

విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదుకు ప్రత్యేక నెంబరు

ఐసిఎఫ్, జూన్ 9: విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులకు ప్రత్యేక నెంబరును విద్యుత్ బోర్డు ప్రకటించింది. విద్యుత్ బోర్డు నుంచి కనెక్షన్లు లేకుండా విద్యుత్ సాధనాల నుంచి కొందరు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. అలాగే, గృహ విభాగం కోసం విద్యుత్ కనెక్షన్ తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇలా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్టు గుర్తించిన వారు 9445857591 అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇవి మినహా విద్యుత్ బోర్డు వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 9: మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పల్లావరం: ఇందిరా గాంధీ రోడ్డు, మారయమ్మన్ ఆలయ వీధి, బజార్ రోడ్డు, మలైమేడు

తండయార్‌పేట: జియ్యర్ రోడ్డు ప్రధాన వీధి, ఐ డ్రీమ్స్ మూడో లైన్

ఎన్నూర్: కత్తివాక్కం, ఎన్నూరు బజారు, కాట్టుకుప్పం, నెహ్రూ నగర్, శాస్త్రినగర్, అన్నానగర్, శివన్‌పడై వీధి, వళ్లువర్‌నగర్, కామరాజ్‌నగర్, ఎస్వీఎం నగర్, వీఓసీ నగర్, ఉలగనాథపురం, ముఖద్వారకుప్పం, ఎన్నూరు కుప్పం, తాలాంకుప్పం, నెట్టుకుప్పం, చిన్నకుప్పం, పెరియకుప్పం, ఎర్నావూర్ కుప్పం, ఈటీపీఎస్ క్వార్టర్స్, ఎర్నావూర్, జ్యోతినగర్, రామనాథపురం, శక్తిగణపతినగర్, షణ్ముగపురం

పెరుంబాక్కం: వేళచ్చేరి మెయిన్ రోడ్డు, మాంబాక్కం మెయిన్ రోడ్డు, జయచంద్రన్ నగర్, రైస్‌మిల్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ ఆర్చి, మేడవాక్కం, గాంధీనగర్ సొసైటీ, నూక్కంపాళయం రోడ్డు, రోజ్ గార్డెన్ రోడ్డు, ప్లాజా 1,2 వీధులు

ఎళిల్‌నగర్: కర్పగవినాయగర్ 1వ మెయిన్ రోడ్డు, కర్పగ వినాయగర్ 6 నుంచి 30 వీధులు, సౌందర్య గార్డెన్ మెయిన్ రోడ్డు

ఐఐటీ: పొన్నియమ్మన్ ఆలయ వీధి, కొత్త వీధి, గణపతి అవెన్యూ, కందన్ గార్డెన్, కోట్టూరు తురకాత్తమ్మన్ ఆలయ వీధి, ఏరికరై శాలై 1వ మెయిన్ రోడ్డు, మన్నప్ప వీధి, యాదవ వీధి, కోట్టూరు గార్డెన్ 1 నుంచి 4 మెయిన్ రోడ్డు, ఎన్జీఓ క్వార్టర్స్, అరింజర్ అన్నా వీధి, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 4వ వీధి వరకు

కొట్టివాక్కం: న్యూ బీచ్ రోడ్డు, న్యూ బీచ్ రోడ్డు ఎక్స్‌టెన్షన్, సిద్రాస్ హోటల్, ఆర్టీఓ కార్యాలయం, తిరువళ్లువర్‌నగర్, ఐటీబీ రోడు 1 నుంచి 7 మెయిన్ రోడ్డు, 34వ క్రాస్ వీధి నుంచి 54వ క్రాస్ వీధి వరకు, భక్తసింగ్ రోడ్డు 1 నుంచి 6 వీధులు, శివానీ కాలనీ.

రిజర్వేషన్ బోగీలో సాధారణ ప్రయాణికులు

పెరంబూర్, జూన్ 9: రిజర్వేషన్ బోగీల్లో సాధారణ టిక్కెట్లున్న వారు ఎక్కడంతో రిజర్వేషన్ చేసుకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై నుంచి శనివారం సాయంత్రం బయల్దేరిన కన్నియాకుమారి ఎక్స్‌ప్రెస్ తాంబరం రైల్వేస్టేషన్‌లో ఆగిన సమయంలో, ఎస్-2 రిజర్వేషన్ బోగీలో సాధారణ టిక్కెట్లు పొందిన ప్రయాణికులు అధిక సంఖ్యలో ఎక్కారు. దీంతో, రిజర్వేషన్ చేసుకున్న వారు తమ సీట్ల దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని టీసీలకు చెప్పినా వారు నుంచి ఎలాంటి సమాధానం లేకపోయింది. దీంతో ఆగ్రహించిన రిజర్వేషన్ ప్రయాణికులు రైలు విరుదాచలం చేరకున్న సమయంలో రైలు ఆపి ఆందోళనకు దిగారు. రైల్వే అధికారులు అక్కడకు చేరుకొని వారితో చర్చించి ఆందోళన విరమింపజేయడంతో రైలు బయల్దేరింది. రైలు అరియలూరు చేరుకున్న వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బంది ఎస్-2 బోగీ దగ్గరకు వెళ్లి సాధారణ టిక్కెట్ ప్రయాణికులను దించి జనరల్ బోగీకి పంపించారు. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రిజర్వేషన్ ప్రయాణికులు కోరుతున్నారు.

20 కిలోల గంజాయితో ముగ్గురు మహిళల సహా 8 మంది అరెస్ట్

పెరంబూర్, జూన్ 9: నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు మహిళలు సహా 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఓట్టేరి మేట్టుపాళయం జంక్షన్‌లో శనివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు, అటువైపు వచ్చిన ఓట్టేరి పటానికి చెందిన అరుళ్‌ను తనిఖీ చేసి 12 కిలోల గంజాయి, రూ.17,29,060 నగదు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వేళచ్చేరి రైల్వేస్టేషన్ సమీపంలో నిసార్ అనే వ్యక్తి బ్యాగు తనిఖీచేసి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇక, పులియాంతోపు హజ్ బిల్డింగ్ వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు, ఉషా అలియాస్ భానుమతి, మియా అలియాస్ ఆనందవల్లి, మోనీషా, వీరరాఘవన్, శ్రీధర్ మహమ్మదర్ నసీర్‌లను అరెస్ట్ చేసి 90 గ్రాముల గంజాయి, ఒక ఆటో, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇదివరకే ఉషాపై 6 గంజాయి కేసులు, మియాపై 9 కేసులు, వీరరాఘవన్‌పై ఒక కేసు ఉన్నాయి. వీరికి కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

బర్త్‌డే పార్టీలో విద్యార్థినిపై అత్యాచారం

● సహాయ నటి సహా ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూన్ 9: స్థానిక సాలిగ్రామంలో బర్త్‌డే వేడుకలకు వెళ్లిన విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వ్యవహారంలో పోలీసులు సహాయ నటి సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. పెరంబూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని చెట్‌పెట్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటూ తన స్నేహితులతో కలసి అన్నానగర్‌లో ఉన్న కాఫీ షాప్‌కు తరచూ వెళ్తుంటుంది. అక్కడ పెరుంగళత్తూర్ ప్రాంతానికి చెందిన సహాయ నటి ప్రతీషా అకీరాతో విద్యార్థినికి పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, సాలిగ్రామంలో ఉన్న ఓ లాడ్జీలో గత నెల 13వ తేది ప్రతీషా జరుపుకున్న బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినితో మత్తు మందు కలిపిన కేక్‌ను ఇద్దరు యువకులు తినిపించారని, తిన్న కాసేపట్లో స్పృహ కోల్పోయిన బాలికపై ఆ యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తరఫున అందిన ఫిర్యాదు మేరకు విరుగంబాక్కం పోలీసులు విచారణ జరిపారు. చిన్నారికి నిర్వహించిన వైద్యపరీక్షల్లో ఆమె అత్యాచారానికి గురైనట్లు తెలిసింది. దీంతో సహాయనటి సహా వడపళనికి చెందిన సోమేష్, విలియమ్స్‌లను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

20కి గోకుల్‌రాజ్ హత్య కేసు విచారణ వాయిదా

ఐసిఎఫ్, జూన్ 9: కోవై జిల్లాలో కలకలం సృష్టించిన గోకుల్‌రాజ్ పరువు హత్య కేసు విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదావేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో యావజ్జీవశిక్ష పొంది కోవై సెంట్రల్ జైలులో ఉన్న మావీరన్ ధీరన్ చిన్నమలై పేరవై అధ్యక్షుడు యువరాజ్‌కు జైలులో ఫస్ట్ క్లాస్ గది కేటాయించాలని కోరుతూ ఆయన భార్య సువిత హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇందులో... యువరాజ్ విద్యార్హత, అంతస్తును దృష్టిలో ఉంచుకొని న్యాయస్థానం ఫస్ట్ క్లాస్ వసతి కల్పించాలని కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు ఎమ్మెస్ రమేష్, సుందరమోహన్‌లతో కూడిన ధర్మాసనంలో విచారణకు వచ్చింది. ఇరుతరపు న్యాయవాదుల వాదనల అనంతరం యువరాజ్‌కు ఫస్ట్ క్లాస్ గది కేటాయించాలని దాఖలైన పిటిషన్ తిరస్కరించి, తదుపరి విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదావేసింది.

కదులుతున్న బస్సులోంచి దూకి యువకుడి ఆత్మహత్య

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు నుంచి తురైయూరు వస్తున్న బస్సులోంచి కిందకు దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుచ్చిచ జిల్లా దురైయూరుకు చెందిన వినోద్ (21) అనే యువకుడు పదో తరగతి చదివి అక్కడి పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం ఆ యువకుడు పెరంబలూరు వెళ్ళి అక్కడ పనులు ముగించుకుని స్వస్థలానికి బస్సులో బయలుదేరాడు. ఆ బస్సు పాటలూరు వద్ద వెళ్తుండగా వినోద్ ఉన్నట్టుండి బస్సులోంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు బిగ్గరగా అరిచి కిందకు దూకాడు. ఊహించని ఈ సంఘటనతో దిగ్భ్రాంతి చెందిన డ్రైవర్ బస్సుకు బ్రేక్ వేసి నిలిపాడు. ఆ తర్వాత కండక్టర్ ఇతర ప్రయాణికులు రోడ్డుపై పడిన వినోద్‌ను కాపాడేందుకు పరుగెత్తారు. అయితే అప్పటికే అతను తలకు బలమైన గాయాలు తగలటంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

భక్తాంజనేయుడికి ప్రత్యేక పూజలు

వేలూరు, జూన్ 9: స్థానిక కాట్పాడి చిత్తూర్ బస్టాండ్ సమీపంలోని భక్తాంజనేయ ఆలయంలో ఆదివారం ఉదయం ఆంజనేయస్వామికి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు కన్నన్ నేతృత్వంలో స్వామివారికి బంగారు కవచం, వడమాల వేసి మహా దీపారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



లారెన్స్ సరసన మృణాల్ ?


మృణాల్ ఠాకూర్

'సీతారామం' ఫేం మృణాల్ ఠాకూర్ మరో తమిళ చిత్రంలో అవకాశాన్ని దక్కించుకుందని కోలీవుడ్ వర్గాల సమాచారం. రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తూ స్వీయ నిర్మాణంలో తెరకెక్కనున్న 'కాంచన' నాలుగో భాగంగా హీరోయిన్‌గా మృణాల్‌ను ఎంపిక చేసినట్టు వినికిడి. అయితే, దీనిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరులో ప్రారంభం కానుందని రాఘవ లారెన్స్ ప్రకటించిన విషయం తెల్సిందే. కాగా, 'కాంచన' సిరీస్‌లో భాగంగా ఇప్పటివరకు వచ్చిన చిత్రాల్లో తొలి భాగంలో రాయ్‌లక్ష్మి, రెండో భాగంలో తాప్సీ, నిత్యామీనన్, మూడో భాగంలో ఓవియ, వేదిక, నిక్కీ తంబోలా నటించిన విషయం తెల్సిందే. నాలుగో భాగంగా, మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు.

రివ్యూల్లో 'మహారాజ' మూల కథను లీక్ చేయొద్దు

● ఫిల్మ్ క్రిటిక్స్‌కు విజయ్ సేతుపతి వినతి

చిత్రజ్యోతి

తాను హీరోగా నటించిన 'మహారాజ' చిత్రం మూల కథను ఫిల్మ్ క్రిటిక్స్ తమ రివ్యూల్లో రాయొద్దని ఆ చిత్ర కథానాయకుడు విజయ్ సేతుపతి విజ్ఞప్తి చేశారు. ఓ మంచి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ సినిమా చూసే ప్రేక్షకులకు థ్రిల్లింగ్ కలగాలంటే ప్రధాన కథాంశాన్ని బహిర్గతం చేయొద్దని కోరారు. ఇది ఆయన నటించిన 50వ చిత్రం. ఫ్యాషన్ స్టూడియోస్, ది రూట్, థింక్ స్టూడియోస్‌లు సంయుక్తంగా నిర్మించగా, ఫైవ్‌స్టార్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న విడుదల చేయనుంది. నితిన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత మోహన్‌దాస్, అభిరామి, అనురాగ్ కశ్యప్, నట్టి, సింగంపులి, అరుల్‌దాస్, మునీష్‌కాంత్, వినోద్ సాగర్, బాయిస్ మణికంఠన్, కల్కి తదితరులు నటించారు. బి.అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో శనివారం రాత్రి నగరంలో విడుదల చేశారు. 'సినిమా పత్రికా విలేకరులు, క్రిటిక్స్ ఈ సినిమా రివ్యూలు రాసేటపుడు ఈ చిత్ర మూల కథను లీక్ చేయొద్దని ఈ సందర్భంగా హీరో విజయ్ సేతుపతి కోరారు. సినిమా ఎలా ఉన్నప్పటికీ రివ్యూలో మీ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించవచ్చు. 'మహారాజ' వంటి చిత్రం నాకు 50వ చిత్రం కావడం, ఇలాంటి చిత్రంలో నేను నటించడం చాలా సంతోషంగా ఉంది. ఫ్యాషన్ స్టూడియో అధినేత సుధన్ నిర్మాతగా నేను నటించిన 25వ చిత్రం 'సీతాకాది' లభించడం నా జీవిత భాగ్యం. నితిలన్‌తో 50వ చిత్రం కోసం పనిచేయడం ఓ బెస్ట్ ఎక్స్‌పీరియన్స్. దర్శకుడు తెరిచిన పుస్తకం వంటి వారు' అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతిపై విజయ్ సేతుపతి స్పందిస్తూ, 'ఇతరుల ఊహలకు ఒక ఆకృతి కల్పించిన దూరదృష్టి కలిగిన గొప్ప వ్యక్తి. ఆయన మృతి వార్త తీవ్రంగా బాధించింది. రామోజీ ఫిల్మ్ సిటీకి 'పుదుప్పేట' చిత్రం షూటింగ్ కోసం వెళ్ళాను. నోట్‌ప్యాడ్, పెన్సిల్ మొదలుకుని సినిమా షూటింగ్ నిర్మాణానికి కావాల్సిన ప్రతి లోకేషన్, ప్రతి వస్తువు అందుబాటులో ఉంచడం గొప్ప విషయం. అది రామోజీ రావుకే చెల్లింది. ఆయన లేనిలేని లోటు భర్తీ చేయలేనిది' అని పేర్కొన్నారు. అలాగే, నటి అభిరామి, దర్శకుడు, నిథిలన్ స్వామినాథన్, ఇతర నటీనటులు, టెక్నీషియన్లు ప్రసంగించారు.


'మహారాజ' ఆడియో రిలీజ్ దృశ్యం

ఎట్టకేలకు ఓ ఇంటివాడైన నటుడు ప్రేమ్‌జీ

నటుడు ప్రేమ్‌జీ ఎట్టకేలకు ఓ ఇంటివాడయ్యారు. ఇందు అనే యువతిని ఆయన వివాహం చేసుకున్నారు. వీరి వివాహం తిరుత్తణిలోని మురుగన్ ఆలయంలో శనివారం రెండు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య జరిగింది. ఈ పెళ్ళికి సంబంధించిన ఫొటోలను సినీ దర్శకుడు, ప్రేమ్‌జీ సోదరుడు వెంకట్‌ప్రభు తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ప్రముఖ సీనియర్ సంగీత దర్శకుడు గంగైఅమరన్ కుమారుల్లో ఒకరు. తమిళ చిత్రపరిశ్రమలో నటుడుగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ప్రేమ్‌జీ గుర్తింపుపొందిన విషయం తెల్సిందే. పైగా కోలీవుడ్‌లోని మోస్ట్ బ్యాచిలర్లలో ఒకరైన 5 యేళ్ళ ప్రేమ్‌జీ సింగిల్‌గానే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన బ్యాచిలర్ జీవితానికి గుడ్‌బై చెప్పి, ఇందు అనే యువతిని వివాహం చేసుకున్నారు. ఈ వివాహానికి గంగై అమరన్, వెంకట్ ప్రభు, నటుడు జై, వైభవ్, గాయకుడు క్రిష్ తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం ప్రేమ్‌జీ పెళ్ళి వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


ప్రేమ్‌జీ - ఇందు పెళ్ళి వేడుక

దీపావళి రేసులో ఐదు చిత్రాలు!


'కంగువా'లో సూర్య

ఈ యేడాది దీపావళి రేసులో ఐదుగురు ప్రధాన హీరోల చిత్రాలు పోటీపడే అవకాశాలున్నాయి. వీటిలో అగ్రహీరోలు అజిత్ కుమార్, సూర్య నటించిన 'విడాముయర్చి', 'కంగువా' చిత్రాలతో పాటు వెట్రిమారన్, సూరి, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'విడుదలై-2' కూడా ఉంది. ప్రస్తుతం అజిత్ 'విడాముయర్చి' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇందులో త్రిష, అర్జున్, ఆరవ్, రెజీనా తదితరులు నటిస్తున్నారు. హీరో సూర్య - దర్శకుడు చిరుత్తై శివ కాంబినేషన్‌లో పదికిపైగా భాషల్లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'కంగువా'. ఈ రెండు సినిమాలు దీపావళికి రిలీజ్ చేయనున్నారు. వీటితో పాటు సూరి, విజయ్ సేతుపతి, మంజు వారియర్ తదితరులు నటించిన 'విడుదలై' రెండో భాగం వెట్రిమారన్ దర్శకత్వంలో నిర్మితమవుతుంది. ఈ సినిమా కూడా దీపావళి రేస్‌లోనే నిలిచింది. అంతేకాకుండా, కొరియోగ్రాఫర్ సతీష్ దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న చిత్రం 'కిస్'. కవిన్ హీరో. ఈ మూవీని కూడా దీపావళికే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్‌టుడే' ఫేం ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న 'ఎల్ఐసీ'ని దీపావళికే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటితో పాటు మరికొన్ని చిత్రాలు విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, అజిత్, సూర్య చిత్రాలు పోటీలో ఉండటంతో అభిమానుల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.


'విడాముయర్చి'లో అజిత్

కలైంజర్ ఎగ్జిబిషన్‌లో సీఎం స్టాలిన్ దంపతుల సందడి


దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఫొటో ప్రదర్శన ఆసక్తిగా వీక్షిస్తున్న సీఎం స్టాలిన్-దుర్గ దంపతులు


ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కరుణానిధి మైనపు బొమ్మ వద్ద ఫొటో తీయించుకుంటున్న సీఎం స్టాలిన్, మంత్రి పీకే శేఖర్‌బాబు తదితరులు

ప్యారీస్, జూన్ 9: స్థానిక ప్యారీస్‌లోని అన్నామలై హాలులో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా ఆయన జీవిత చరిత్రకు సంబంధించి ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్, దుర్గ దంపతులు ఆదివారం ఆసక్తిగా తిలకించారు. హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అన్నామలై హాలులో కలైంజర్ '100 సార్లు-కాలం ఉల్లవరై కలైంజర్ అనే నినాదంతో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంటోంది. బాల్యంలో తిరువారూర్‌లో కరుణానిధి గడిపిన రోజుల నుంచి చెన్నై మెరీనా బీచ్‌లో ఆయన స్మారక మందిరం వరకు వందల సంఖ్యలో అరుదైన ఫొటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనకు మరింత గుర్తింపు తీసుకొచ్చేలా మెయిన్ హాలులో ఆధునిక టెక్నాలజీతో 40 ఏళ్ల వయస్సులో కరుణానిధి చిరునవ్వులు చిందించే మైనపు బొమ్మను ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి హోదాలో కరుణానిధి జాతీయ, అంతర్జాతీయ నాయకులతో కలసి తీయించుకున్న ఫొటోలు, సీఎంగా ఆయన అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫొటోలను నగరవాసులు తిలకిస్తున్నారు. ఆదివారం ఉదయం స్టాలిన్ దంపతులు ఈ ప్రదర్శన తిలకించి ఏర్పాటు చేసిన మంత్రి శేఖర్‌బాబును అభినందించారు. సీఎం దంపతులతో పాటు పార్లమెంటు సభ్యులు రాజా, పి.విల్సన్, సినీ దర్శకుడు పళనియప్పన్ తదితరులు కలైంజర్ ఎగ్జిబిషన్‌లో సందడి చేశారు.

'టైమ్స్ విల్' ఆంగ్ల కవిత సంపుటి ఆవిష్కరణ

అడయార్, జూన్ 9: మాజీ న్యాయమూర్తి ఏ.రత్నవేలు రచించిన ప్రేరణాత్మక ఆంగ్ల కవితల సంకలనం 'టైమ్స్ విల్' ఆవిష్కరించారు. రాయపేటలోని ఇండియన్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంటినరీ బిల్డింగ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్యకారులు, న్యాయనిపుణులు పాల్గొన్నారు. లోతైన తాత్విక దృక్పథాలు, అనర్గళమైన రచనల్లో పేరొందిన మాజీ న్యాయమూర్తి ఏ.రత్నవేలు మానవానుభవాల లోతు విశ్లేషించేలా ఈ కవితా సంపుటిని రూపొందించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఎస్.భాస్కరన్, పద్మశ్రీ డాక్టర్ కేజీ భక్తవత్సలం, ఐఏఎస్ అధికారి శంభు కల్లోలికర్, మద్రాస్ విశ్వవిద్యాలయం ఇంగ్లీషు శాఖ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్మ్ స్ట్రాంగ్, వీఐటీ కాలేజ్ ఇన్‌స్టిట్యూషన్స్ రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహరన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీఆర్ సంపత్, ఏ.రత్నవేలు, బంధువులు తదితరులు పాల్గొన్నారు. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి సీవీ కార్తికేయన్ కీలక ప్రసంగం చేశారు.


'టైమ్స్ విల్' పుస్తకావిష్కరణ దృశ్యం

గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన

వేలూరు, జూన్ 9: తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గాన్ని హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ మురళీధరన్ ఆదివారం పరిశీలించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు అందించాల్సిన సౌకర్యాలు, ఆక్రమణకు గురవుతున్న గిరి ప్రదిక్షిణ మార్గం తదితరాలను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్, పలువురు అధికారులున్నారు.


గిరి ప్రదిక్షిణ మార్గాన్ని పరిశీలిస్తున్న హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ మురళీధరన్

రూ.1,957 కోట్లతో ఆలయాల మరమ్మతులు

● మంత్రి శేఖర్‌బాబు వెల్లడి

అడయార్, జూన్ 9: రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,957 కోట్లతో 10 వేలకు పైగా ఆలయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని దేవాదాయ శాఖామంత్రి పి.కే.శేఖర్ బాబు తెలిపారు. తిరువాన్మియారులోని పాంబన్ కుమార గురుదాసర్ స్వామి ఆలయంలో కుంభాభిషేక పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వివిధ రకాలైన న్యాయ చిక్కుల్లో ఉన్న ఆలయాలకు విముక్తి కల్పించి, వాటికి కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయాలకు చెందిన రూ.6 వేల కోట్ల విలువ చేసే 6,308 ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. బడ్జెట్‌లో ప్రకటించకపోయినప్పటికీ 10,727 ఆలయ అభివృద్ధి పనులు రూ.1,957 కోట్ల వ్యయంతో సాగుతున్నాయని పేర్కొన్నారు.


ఆలయ రథం పనులను ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు


ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటకులు

మంచుపరదాల మాటున కొడైకెనాల్

పెరంబూర్, జూన్ 9: చిరుజల్లులు... మంచు... తదితరాలతో కొడైకెనాల్ జిల్లుమంటూ ఆహ్లాదకర వాతావరణం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉంటూ దట్టమైన మంచు కురుసింది. వాటిమధ్య వాహనాలు హెడ్ లైట్లు వేసుకొనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొడైకెనాల్‌లోని కోకర్స్ వాక్, మన్నవనూర్ సహా పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు విపరీతమైన చలి తట్టుకొనేలా స్వెట్టర్లు, తలకు మఫ్లర్ ధరించారు. దీనికి తోడు చిరుజల్లులు కురుస్తుండగా, పడవ, గుర్రపు స్వారీతో పాటు పిల్లలు సైకిళ్లపై చక్కర్లు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు.



జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎం. రాజారామ్

మాజీ ఐఏఎస్ అధికారికి జీవన సాఫల్య పురస్కారం

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎం.రాజారామ్ రవాణా శాఖ, టూరిజం, కార్మిక, సమాచార శాఖల్లో విశిష్ఠ సేవలందించినందుకుగాను రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై కేపిటల్ డిస్ట్రిక్ట్ 3232 జీవన సాఫల్యపురస్కారం ప్రకటించింది. ఆ మేరకు నగరంలో శనివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాజారామ్ ఆ పురస్కారాన్ని స్వీకరించారు. ఇదే విధంగా అపోలో ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జెన్ డాక్టర్ జాయ్ వర్గీస్‌కు వృత్తిపరమైన ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో క్లబ్ అధ్యక్షులు సత్యారావు, కార్యదర్శి డాక్టర్ అశోక్ జార్జి వర్గీస్, రోటేరియన్ ప్రణవ్ లిలాని తదితరులు పాల్గొన్నారు.


చెన్నైలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రముఖ తమిళ సినీ హాస్య నటుడు చార్లీ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పుదువైలో ఓటేసిన ఫ్రెంచ్ ఓటర్లు

అడయార్, జూన్ 9: యూరోపియన్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యూరోపియన్ పార్లమెంట్‌లో మొత్తం 720 సీట్లుండగా, ఇందులో 81 మంది ఫ్రెంచ్ ప్రతినిధుల ప్రాతినిత్యం ఉంది. వీటికి మొత్తం 38 రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో భాగంగా యూరోపియన్ దేశాల్లో జూన్ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పోలింగ్ జరిగింది. అయితే, పుదుచ్చేరిలో అనేక మంది ఫ్రెంచ్ ఓటర్లు ఉండగా, వారంతా ఆదివారం జరిగిన పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ రాయబార కార్యాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభంకాగా, ఫ్రెంచ్ పౌరసత్వం ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది.


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఫ్రెంచ్ పౌరులు

చెన్నైలో ఆదివారం సాయంత్రం జరిగిన మద్రాసు హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భాస్కర్ కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఎంపీ విల్సన్ తదితరులు



రాష్ట్ర బీజేపీలో క్రిమినల్స్

మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి పదవికి రాజీనామా చేసిన తర్వాత పార్టీలో నేర చరితుల సంఖ్య బాగా పెరిగిందంటూ తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో సౌత్ చెన్నై నియోజకవర్గంలో పోటీ చేసేందుకు గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేశారు. ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రచార సమయంలో ఓటర్లకు ఇచ్చిన వాగ్దానం మేరకు సౌత్ చెన్నైలో ఆమె కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో తమిళిసై మళ్ళీ బీజేపీలో చక్రం తిప్పేందుకు సన్నద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల్లో కలకలం బయలుదేరింది. అందరూ అనుకున్నట్టే తమిళిసై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పొత్తుపెట్టుకుని ఉంటే పది సీట్లు సులువుగా గెలుచుకుని ఉండేవారమంటూ అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి ప్రకటనకు తమిళిసై వత్తాసు పలికారు. అంతటితో ఆగకుండా తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నంతవరకూ నేరచరిత ఉన్నవారెవరినీ పార్టీలో చేర్చుకోలేదన్నారు. ప్రస్తుతం పార్టీలో క్రిమినల్స్ సంఖ్య పెరగటం శోచనీయమన్నారు. తమిళిసై చేసిన విమర్శలు బీజేపీలో తీవ్ర కలకలం సృష్టించింది. ఇప్పటికే కొంతమంది నాయకులు ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. మరికొంద రు ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీల్లో అడ్మిషన్లకు
నేటినుంచి జనరల్ కౌన్సెలింగ్

● 3 నుంచి తరగతుల ప్రారంభం

పెరంబూర్, జూన్ 9: రాష్ట్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి తొలివిడత జనరల్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్ర ఉన్నత విద్య శాఖ కళాశాల విద్య డైరెక్టరేట్ పరిధిలో 169 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలున్నాయి. వాటిలో బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సుల్లో 1.07 లక్షల సీట్లున్నాయి. ఈ కళాశాలల్లో 2024-25వ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గత నెల 6న ప్రారంభమై 24వ తేది వరకు జరిగింది. మొత్తం 2,58,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, వారిలో 2,11,010 మంది దరఖాస్తు రుసుము చెల్లించారు. ఈ క్రమంలో, గత 28 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక కోటా విద్యార్థుల కౌన్సెలింగ్ జరిగింది. అడ్మిషన్లకు సంబంధించి తొలివిడత జనరల్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి 15వ తేది వరకు జరుగనుంది. ర్యాంకుల జాబితా ఆధారంగా విద్యార్థులను కౌన్సెలింగ్‌ను అనుమతించనున్నారు. రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ఈ నెల 24 నుంచి 29వ తేది వరకు జరుగనుంది. మొదటి సంవత్సరం తరగతులు జూలై 3వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి.